క్లుప్తంగా

ముగిసిన బ్రహ్మోత్సవాలు



అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని గడ్డి అన్నవరక్షేత్ర వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయ 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. స్వామివారికి శనివారం అష్టోత్తర కలశ పంచామృత అభిషేకం నిర్వహించామని ఆలయ చైర్మన్ వూర నర్సింహ గుప్తా తెలిపారు. బ్రహ్మోత్సవాలు ఆరు రోజులు జరిగాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారని ఆయన చెప్పారు.

ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని కాపాడాలి



పురుషోత్తమ భారతి స్వామికి స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురం డివిజన్ అల్కాపురి కాలనీలోని శ్రీశారదా పీఠం శృంగేరి శంకరమఠాన్ని శృంగేరి శివగంగ శారదా మార్గదర్శకులు పురుషోత్తమ భారతి మహాస్వామి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి గురువందనం చేశారు. ఈ సందర్భంగా పురుషోత్తమ భారతి స్వామి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సనాత ధర్మాన్ని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మాధికారి ముదికొండ శంకర్ శర్మ , బంగారయ్య శర్మ, కేవీ శ్రీనివాస్ శర్మ, గౌరీ భాస్కర్ శర్మ, దేవ భాస్కర్ రెడ్డి, సంతోష్ కుమార్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని మారుతీనగర్ శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ధ్వజస్తంభం, రాజగోపురం ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు కార్పొరేటర్‌కు తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, క్రాంతికిరణ్, బ్రహ్మజీరావు, శ్రీనివాస్ రవికిరణ్, చంద్రధర్, శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

నెల రోజులుగా ఇదే దుస్థితి



బండ్లగూడ చౌరస్తాలో రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీరు

- స్పందించని జలమండలి అధికారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- తీవ్ర దుర్వాసనతో కాలనీవాసుల ఇబ్బందులు

నాగోలు: గత నెల రోజుల నుంచి నాగోలు డివిజన్ పరిధిలోని బండ్లగూడ చౌరస్తాలో డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి డ్రైనేజీ నీరు పెద్ద ఎత్తున రోడ్డుపై పారడంతో దుర్వాసనతో కాలనీవాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో బండ్లగూడ ప్రధాన రహదారి వెంట రెండు కిలో మీటర్ల మేరకు డ్రైనేజీ నీరు రోడ్డు మీద పారుతోంది. జలమండలి అధికారులు నామమాత్రంగా వచ్చి పరిశీలించి వెళ్తున్నారు తప్పా సమస్య పరిష్కారం కావడం లేదు.

◆ నెల రోజులుగా ప్రధాన రహదారిపై నుంచి డ్రైనేజీ నీరు ఏరులై పారుతున్నా జలమండలి అధికారులు, అధికార పార్టీ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పట్టించుకోక పోవడంతో డ్రైనేజీతో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు.

◆ ప్రధాన రహదారి నుంచి బండ్లగూడ విలేజ్ నుంచి విజయ్ గార్డెన్, శ్రీనివాస్‌నగర్ వరకు డ్రైనేజీ నీరు రోడ్డు మీద డ్రైనేజీ నీరు రావడంతో స్థానికంగా ఉండే షాపుల నిర్వాహకులు, కాలనీ వాసులు డ్రైనేజీ దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు.

◆ ఈ విషయంపై జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జలమండలి ఉన్నత అధికారులు స్పందించి వెంటనే డ్రైనేజీ సమస్యను పర్కిరించాలని స్థానికులు, కాలనీవాసులు కోరుతున్నారు.

రెండు రోజుల్లో పనులు పూర్తి చేస్తాం

డ్రైనేజీ పైప్‌లైన్‌లో మట్టి నిండిపోవడంతో డ్రైనేజీ పారుతోంది. డ్రైనేజీ మరమ్మతుల కోసం నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టుకు పనులు మొదలు పెట్టమని చెప్పాం . రెండు రోజుల్లో పనులు పూర్తి చేస్తాం.

– అలేఖ్యారెడ్డి, జలమండలి అధికారి

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



డ్రైనేజీ పూడికతీత పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లోని ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల డివిజన్ పరిధిలోని కృష్ణానగర్‌లో కార్పొరేటర్ పర్యటించినప్పుడు స్థానికులు కాలనీలోని డ్రైనేజీలు నిండి రహదారిపై పారుతూ తాము ఇబ్బందులకు గురవుతున్నామని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ వాటర్‌వర్క్స్ అధికారులతో చర్చించారు. శనివారం బకెట్ వాహనం, సిబ్బందిని రప్పించి కృష్ణానగర్‌లోని డ్రైనేజీలో పూడిక తీయించారు. పనులను కార్పొరేటర్ దగ్గరుండి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, కాలనీలు, బస్తీల్లో మౌలిక వసుతులు కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. డివిజన్ పరిధిలో ఎక్కడైనా ఏదేని సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని స్థానికులను కోరారు. వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి దానిని పరిష్కరిస్తామని కార్పొరేటర్ తెలిపారు.

రేపు సీనియర్ సిటిజన్స్ భవనం ప్రారంభోత్సవం

హయత్‌నగర్: హయత్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన సీనియర్ సిటిజన్స్ భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభిస్తారని హయత్‌నగర్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రం బాల్‌రెడ్డి,గౌరవ అధ్యక్షుడు నక్కా దర్శన్‌గౌడ్ శనివారం తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సీనియర్ సిటిజన్స్ పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

16న మలక్‌పేట మోర్చాల సమ్మేళనం

సైదాబాద్: పార్లమెంట్ ప్రవాసీ యోజన కార్యక్రమంలో భాగంగా మలక్‌పేట నియోజకవర్గ పరిధిలోని పార్టీ ఏడు మోర్చాల నా యకులు, కార్యకర్తల సమ్మేళనం నిర్వహిస్తున్నామని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈనెల 16న సైదాబాద్ డివిజన్ ఎస్‌బీహెచ్ జీఏ కాలనీలోని పద్మావతి కల్యాణ మండపంలో నిర్వహించనున్న సమ్మేళానానికి మధ్యప్రదేశ్ బీజేపీ ప్రభారీ మురళీధర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. నియోజకవర్గ పార్టీ నాయకులు, అన్ని మోర్చాల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కేన్సర్ బాధితులకు జుట్టు దానం



హెయిర్ డొనేషన్ చేయడానికి వచ్చిన చిన్నారులు

సైదాబాద్: కేన్సర్ రోగులకు కీమోథెరపీ చికిత్స కారణంగా జుట్టు రాలిపోవటంతో వారిలో ఏర్పడే ఆత్మన్యూనత భావాన్ని తొలగించడానికి విగ్గులు అందజేస్తున్నామని హోప్ ఫర్ లైవ్ ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. కేన్సర్ సర్వైవర్ మంత్ సందర్భంగా శనివారం హోప్ ఫర్ లైవ్, మిలాప్, హైదరాబాద్ హెయిర్ డొనేషన్ ఫర్ కేన్సర్ పేషెంట్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో కేన్సర్ బాధితుల కోసం గడ్డిఅన్నారంలో హెయిర్ డొనేషన్ డ్రైవ్ నిర్వహించారు. అందులో పలువురు యువత, చిన్నారులు పాల్గొని తమ సహృదయతను చాటుకున్నారు. హెయిర్ డొనేషన్ డ్రైవ్‌లో 50 మంది నుంచి జుట్టు సేకరించారు. చిన్నారులు, యువత నుంచి సేకరించిన శిరోజాలతో కృత్రిమ విగ్గులు తయారు చేసి కేన్సర్ బాధితులకు ఉచితంగా అందిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

తోపుడు బండ్ల తొలగింపు

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ ప్రభాత్‌నగర్ కాలనీ ప్రధాన రహదారి వెంట ఉన్నపండ్ల వ్యాపారుల తోపుడు బండ్లను శనివారం ట్రాఫిక్ సిబ్బంది తొలగించారు. తోపుడు బండ్ల ఏర్పాటు వల్ల కాలనీలోకి వాహన రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, మురిగిపోయిన పండ్లను రోడ్ల పక్కనే వేస్తున్నారని డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. దీంతో ఆయన కాలనీవాసులతో కలిసి ట్రాఫిక్ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. ట్రాఫిక్ సిబ్బంది రహదారి పక్కనే ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించారు. జీహెచ్ఎంసీ సిబ్బందితో చెత్త, కుళ్లిపోయిన పండ్లను ప్రత్యేక వాహనంలో తరలించినట్లు మహేష్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, జయశ్రీ, రమణారెడ్డి, సుధాకర్ సుభాష్, గట్టు శ్రీనివాస్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభాత్‌నగర్ ప్రధాన రహదారిలో కుళ్లిన పండ్లు, చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ కార్మికులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతు పనుల కారణంగా ఆదివారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని ఈ కింద ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

◆ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు...

అక్బర్‌బాగ్ స్కూల్, స్టాండ్లీ స్కూల్, దర్గా ఏ ఉజాలేషా, జీవన్‌జంగ్ కాలనీ, డి–క్వార్టర్స్ పరిసర ప్రాంతాలు.

◆ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు..

ఎంసీ కాలనీ, రామాలయం, ఎస్‌బీహెచ్ కాలనీ, ఆస్మాన్‌ఘడ్ వాటర్‌వర్క్స్, ఆర్‌బీ కాలనీ, ముంతాజ్ కాలేజీ, మలక్‌పేట పీఎస్, మహిళా మండలి, బీ-బ్లాక్, హమాలీబస్తీ, వెంకటాద్రినగర్ పరిసర ప్రాంతాలు.

పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎంఆర్ఎఫ్ దోహదం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని, పేదల ఆరోగ్య పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతోందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ సుభాష్‌చంద్రబోస్ కాలనీకి చెందిన సాంబమూర్తి కిడ్నీలకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్నాడు. పేదవాడైన ఇతడి ఆపరేషన్ ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థిక సాయం ఇప్పించాలని కుటుంబసభ్యులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిశారు. ఎమ్మెల్యే వారి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 2.5 లక్షలు మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీ చెక్కును శనివారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి లబ్ధిదారు సాంబమూర్తి కుమారుడికి అందజేశారు. కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, పల్లకొండ శ్రీనివాస్, విజయ్‌భాస్కర్ రెడ్డి, ఉప్పలయ్య, దశరథ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వారికో రూల్... మాకో రూలా?

కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీల తొలగింపుపై జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం



ఎల్‌బీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలను తొలగించి, బీఆర్‌ఎస్ ఫ్లెక్సీలను అలాగే ఉంచిన దృశ్యం

మన్సూరాబాద్: ఎల్బీనగర్‌లో ప్రతిపక్ష పార్టీలకే నిబంధనలు వర్తిస్తాయా... అధికార బీఆర్‌ఎస్ పార్టీకి వర్తించవా, ఫ్లెక్సీల ఏర్పాటులో అధికార పార్టీకి ఒక రూల్, ప్రతిపక్ష పార్టీలకు మరొక రూలా.. అని టీపీసీసీ డెలిగేట్, కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి జీహెచ్ఎంసీ అధికారుల తీరుపై మండిపడ్డారు. శనివారం మన్సూరాబాద్ సెంట్రల్‌బ్యాంక్ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అనుచరులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల జోలికి వెళ్లకుండా, కేవలం కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలను తొలగించడంపై జక్కిడి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సు. దీర్‌రెడ్డి ప్రత్యేక రాజ్యాంగం నడుస్తోందా... కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే అధికార పార్టీ ఎమ్మెల్యేకు, అధికార పార్టీ కార్యకర్తల్లా పనిచేస్తున్న అధికారులకు భయమెందుకని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డిపై ఎమ్మెల్యే ప్రోద్బలంతో ఆయన అనుచరులు దాడి చేశారని, దాడికి గురైన వ్యక్తిపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి సతీష్‌రెడ్డి, బుద్ధ సత్యనారాయణ, పెంటయ్య, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం

సైదాబాద్: వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన సైదాబాద్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... సైదాబాద్ పూసలబస్తీకి చెందిన ప్రైవేట్ ఉద్యోగి గోరంట్ల వెంకట కిషోర్‌కు పాతంశెట్టి గ్రామానికి చెందిన సంధ్య(21)తో వివాహమైంది. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు నిద్రలేచిన వెంకట్ కిషోర్‌కు ఇంట్లో భార్య సంధ్య కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేదు. అతని భార్య తల్లిదండ్రులకు సమాచారమిచ్చి, బంధువులను విచారించినా సంధ్య ఆచూకీ లభించలేదు. భర్త వెంకట కిషోర్ ఫిర్యాదుతో సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో డాక్టర్...

చంపాపేట అంకిత్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న డాక్టర్ కె.శ్రీకాంత్‌రెడ్డి (36)కి ఐదేళ్ల క్రితం భాగ్యశ్రీతో పెళ్లైంది. వారు తమ కూతురితో కలిసి హాస్పిటల్ సమీపంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఎనిమిది నెలల క్రితం భాగ్యశ్రీ డెలివరీ కోసం గుల్బర్గాలోని పుట్టింటికి వెళ్లింది. ఈనెల 7న ఆమె అత్త, మామలతో కలిసి చంపాపేటలోని ఇంటికి తిరిగి వచ్చింది. అయితే శ్రీకాంత్‌రెడ్డి ప్రస్తుతం హాస్పిటల్‌లో పనిచేయడం లేదని, ఇంటి అద్దె కూడా చెల్లించడం లేదని వారికి తెలిసింది. ఆ విషయమై తండ్రి అతనిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. అదేరోజు శ్రీకాంత్‌రెడ్డి వారిని ఆటోలో నాంపల్లి రైల్వేస్టేషన్‌కు పంపాడు. నాకు కొద్దిగా పని ఉంది, అది చూసుకొని నాంపల్లికి వస్తానన్నాడు. అతను ఎంతకీ తిరిగి రాకపోవడంతో చుట్టాలు, మిత్రులను సంప్రదించినా ఆచూకీ తెలియలేదు. శుక్రవారం కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి

చాదర్‌ఘాట్: దివ్యాంగుల సర్వతోముఖాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు దైనంపల్లి మల్లికార్జున్ అన్నారు. శనివారం ఆయన మలక్‌పేటలో మాట్లాడుతూ, ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. దివ్యాంగుల పింఛన్ రూ.3016 నుంచి రూ.4016కు పెంచిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల భద్రత, భరోసాకు ప్రాధాన్యం

- సైదాబాద్‌లో ప్రారంభమైన సౌత్‌ఈస్ట్ జోన్ మహిళా ఠాణా
- మహిళా పీఎస్ పరిధిలో 10 శాంతి భద్రతల స్టేషన్లు
- కొత్త ఠాణా ఇన్‌స్పెక్టర్ బి.అనురాధతో 'సాక్షి' ఇంటర్వ్యూ



సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన నూతన సౌత్‌ఈస్ట్ జోన్ మహిళా పోలీస్ స్టేషన్



ఇన్‌స్పెక్టర్ బి.అనురాధ

సైదాబాద్: హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా నూతనంగా ఏర్పడిన సౌత్‌ఈస్ట్ జోన్ పరిధిలో జోన్ మహిళా పోలీస్ స్టేషన్‌ను సైదాబాద్ శంకేశ్వరబజార్‌లోని పాత పోలీస్ అవుట్ పోస్టులో ఏర్పాటు చేశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈనెల 2 నుంచి ఠాణాలో కార్యకలాపాలు ప్రారంభించారు. మహిళలకు భద్రత, భరోసా కల్పించడానికి ప్రాధాన్యం ఇస్తామని నూతన ఠాణాకు మొదటి ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.అనురాధ తెలిపారు. ఆమెతో 'సాక్షి' ప్రతినిధి ప్రత్యేక ఇంటర్వ్యూ...

సాక్షి: గతంలో మీరు ఎక్కడ పని చేశారు?

ఇన్‌స్పెక్టర్: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వద్ద చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా విధులు నిర్వహించాను. బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చాను.

సాక్షి: సౌత్‌ఈస్ట్ జోన్ మహిళా ఠాణా పరిధి ఎంత?

ఇన్‌స్పెక్టర్: జోన్ పరిధిలో ఉన్న అన్ని శాంతి భద్రతల ఠాణాలు (సైదాబాద్, మలక్‌పేట, చాదర్‌ఘాట్, ఐఎస్‌సదన్, మాదన్నపేట, సంతోష్‌నగర్, కంచన్‌బాగ్, బండ్లగూడ, చాంద్రాయణగుట్ట, డబీర్‌పురా పీఎస్‌లు) సౌత్‌ఈస్ట్ జోన్ మహిళా ఠాణా పరిధిలోకి వస్తాయి.

సాక్షి: కొత్త పీఎస్‌లో కేసులు నమోదయ్యాయా?

ఇన్‌స్పెక్టర్: మహిళా పోలీస్ స్టేషన్ కార్యకలాపాలు 6 రోజులుగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదు. ఫిర్యాదులు వస్తున్నాయి. అవి ఇంకా కౌన్సెలింగ్ దశలో ఉన్నాయి.

సాక్షి: మీ దగ్గరికి ఎక్కువగా వచ్చే కేసులు ఏంటి?

ఇన్‌స్పెక్టర్: మహిళా పీఎస్‌కు ఎక్కువగా భార్యాభర్తల వైవాహిక విషయాలకు సంబంధించినవి వస్తుంటాయి. అలాగే కట్నం వేధింపుల కేసులు వస్తాయి. ఈవ్ టీజింగ్‌కు సంబంధించిన కేసులు వస్తే షీటీమ్స్‌కు బదలాయిస్తాం. మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

సాక్షి: వైవాహిక విషయాల ఫిర్యాదులపై ఎలా స్పందిస్తారు?

ఇన్‌స్పెక్టర్: వైవాహిక విషయాల ఫిర్యాదులు సున్నితంగా ఉంటాయి. అలాంటి ఫిర్యాదులు వచ్చినప్పుడు మొదట భార్యాభర్తలకు కౌన్సిలింగ్ ఇస్తాం. ఎంతకీ వారి మధ్య సయోధ్య కుదరకపోతే కేసులు నమోదు చేస్తాం.

సాక్షి: మహిళలకు మీరు ఇచ్చే సూచనలు ఏంటి?

ఇన్‌స్పెక్టర్: మహిళలు తమ ఫిర్యాదులను వారు నివసించే పరిధిలోని లా అండ్ ఆర్డర్ పీఎస్‌లో లేదా నేరుగా మహిళా పీఎస్‌కు వచ్చి ఇవ్వొచ్చు. మహిళలు పోలీస్ స్టేషన్‌కు నిర్భయంగా రావొచ్చు. వారి సమస్యలను పరిష్కరించడానికే మేము (పోలీసులు) ఉన్నామని మహిళలు భరోసా పెట్టుకోవాలి.

58, 59 జీఓలతో ప్రభుత్వం రియల్ వ్యాపారం: సామ



ధర్నాలో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: 58,59 జీఓలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాల నడ్డి విరుస్తోందని, ఈ జీఓలతో రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నదని బీజేపీ రంగారెడ్డి అర్బన్‌జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి మండిపడ్డారు. 58, 59 జీఓలతో ప్రభుత్వ నోటిఫైడ్ స్లమ్ స్థలాలకు క్రమబద్ధీకరణ పేరుతో అధిక ఫీజులు వసూలు చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ ఎల్‌బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో శనివారం ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సామ రంగారెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వం 58,59 జీఓలను తీసుకొచ్చి ఇంటి స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలని చెప్పి.. ఇప్పుడు వారిని మోసం చేస్తోందన్నారు. క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారిని రూ.5లక్షల నుంచి రూ.15 లక్షల వరకు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, లేదంటే ఇంటిని కూల్చివేస్తామని రెవెన్యూ అధికారులు బెదిరిస్తున్నారని విమర్శించారు. ఇటీవల ఎమ్మెల్యే దేవిరెడ్డి సు. దీర్‌రెడ్డి వీరన్నగుట్టలో బస్తీనిద్ర చేసి పేదలకు మోసపూరిత హామీలు ఇచ్చి ఇచ్చారన్నారు. బస్తీనిద్ర కార్యక్రమం పూర్తి కాగానే రెవెన్యూ అధికారులు స్లమ్ ఏరియాల్లోని ఇళ్ల కూల్చివేతకు జేసీబీలతో వచ్చారన్నారు. ఎమ్మెల్యేకు ఈ విషయంపై పేదలు సమాచారం ఇచ్చినా స్పందించలేదని, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, తాను ఘటనా స్థలానికి వెళ్లి కూల్చివేతలను అడ్డుకున్నామని రంగారెడ్డి చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, చింతల అరుణ సురేందర్‌యాదవ్, రంగ నర్సింహగుప్తా, కళ్లెం నవజీవన్‌రెడ్డి, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, పవన్‌కుమార్, ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, నాయకులు కళ్లెం రవీందర్‌రెడ్డి, కటకం నర్సింగ్‌రావు, నాంపల్లి రామేశ్వర్, మహిళా నాయకులు కృష్ణవేని, నందికొండ గీతారెడ్డి, మన్నెం అరుణ, కర్నాటి మాధవి, కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పెన్షన్ పెంపుపై హర్షం

వనస్థలిపురం: దివ్యాంగులకు ఆసరా పెన్షన్లు రూ.3,116 నుంచి రూ.4,116 లకు పెంచుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షనీయమని డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ (డ్యాబ్) ప్రధాన కార్యదర్శి, ఏఐసీబీ కార్యదర్శి పానుగోటి చొక్కారావు, డ్యాబ్ కోశాధికారి పరమేష్ పేర్కొన్నారు. శనివారం ఎల్‌బీనగర్ చింతలకుంటలోని డ్యాబ్ ప్రధాన కార్యాలయంలో ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. పెన్షన్ పెంపు విషయమై డ్యాబ్ ప్రభుత్వాన్ని పలుమార్లు కోరిందని వారు తెలిపారు.